చూసిన వాళ్లందరూ ఆ కాలేజీకి బ్యాటికింగ్ గోపాలక్రిష్ణే నంటారు. బి. కామ్ ఫైనలియర్ చదువుతున్న అతనంటే చిన్నా, పెద్ద పడి చస్తారు ఆ కాలేజీలో... ఒక్క కాలేజీమిటి ? ఆ ఊరి కాలేజీలన్నిటిలోని అందరు స్టూడెంట్స్ అతన్ని లైక్ చేస్తారంటే, అతిశయోక్తి కాదు. అతను అందంలోనే కాక చదువులోను, సంపదలోను అన్నిట్లోనూ కింగే! అతనికి తగిన బ్యాటిక్వీన్ ఏ కాలేజీలోనూ కనిపించక, వెదికి, వెదికి విసిగిపోయారతని ఫ్రండ్స్. డిమాన్‌స్ట్రేటర్స్ దగ్గరున్నించి,

రాధికా పరిణయం

ప్రిన్సిపాల్‌వరకు అతన్ని మెచ్చుకుని, 'కాలేజీకి మకుటం లాంటివాడు' అని అనకుండా ఉండలేకపోయారు. పద్మశ్రీ, పద్మభూషణ్‌లాగ చదువులో అతనికి 'విద్యశ్రీ' బిరుదివ్వచ్చు అంటారందరూ! అతన్ని చూసినవారందరూ లక్ష్మీ, సరస్వతి ఒక చోట ఉండరన్న వాదాన్ని తక్కువ ఖండిస్తారు. మూడేళ్లనుంచి కాలేజీ స్టూడెంట్స్ యూనియన్ సెక్రటరీగా అతన్నే ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ వచ్చారు. అతని కారులో అరడజను మందికి తక్కువ జనం ఎప్పుడూ ఉండరు. కాలేజీ నిత్యకల్యాణం, పచ్చతోరణంగా కలకలలాడటానికి కారణం అతనేనని అందరి నమ్మకం!'.

'ఇంక ఆపు తల్లీ! గోపాలక్రిష్ణ స్తోత్రం' అంది చిరాగ్గా రాధిక ఒడిలో పుస్తకం గట్టిగా క్రింద పడేస్తూ.

ఈ హఠాత్పరిణామానికి అదిరిపోయినా పైకి కనిపించనీకుండా గొంతు సవరించుకుని మళ్లీ మొదలుపెట్టింది ఉమ. 'కాని, పాపం! ఇప్పుడందరికీ ఒకటే విచారం!' అంది సీరియస్‌గా.

పచ్చికలో వెల్లకిలా తలక్రింద చేయి పెట్టుకుని పడుకున్న రాధిక, ఈమాటలకు కలవరపడింది. అప్పుడే విసుక్కుని ఉండటం వలన మౌనం వహించింది. అదేదో తెలుసుకోవాలనే కుతూహలం ఆమె కళ్లలో ప్రతిబింబించటం చూసి, కొంటెగా నవ్వింది ఉమ. కోపంగా చూసింది రాధిక. 'ఎందుకలా ఉడికిపోతావ్‌గాని చెప్తా విను! సకల కాలేజీ జీవరాసుల విచారంబునకు కారణంబైన వృత్తాంతం బెట్టిదనిన, కాలేజీలకు రాజైన ఆ రాజకుమారుడు. ఈ సంవత్సరాంతంబున, అనగా పై సంవత్సరారంభములో ఫారిన్ వెళ్లబోతున్నాడట! అందుకని...'

ఈ వానరసైన్యం ఇప్పట్నించే విచారాంబుధిలో మునిగిపోయారు. అదే...మొన్న వరదల్లో కృష్ణాజిల్లా మునిగినట్లు' అంది ఎగతాళిగా రాధిక.

'నిన్నగాక మొన్నొచ్చావ్, అతనంటే అలా మండిపడతావెందుకు? అతని గురించి ఏం తెలుసని అలా చిరాకు పడతావ్? తర్వాత నీవే విహరించాల్సి వస్తుందమ్మాయ్, జాగ్రత్త!' బెదిరించింది ఉమ.

'నేనెలా ఉంటే నీకేంగానీ, పోనీ నీకు తెలుసుగా? అతని గురించి? అదంతా ఓ పెద్ద గ్రంథం రాసి 'గోపాలక్రిష్ణోపాఖ్యానం' అని పేరుపెట్టు.

'ఓ...తప్పకుండా రాస్తాను. రాసి నీకే అంకితమిస్తాను'

'ఊఁ...సరే ఇక్కడే, ఇప్పుడే మొదలు పెట్టు, నే వెళ్తున్నా!' అంటూ విసురుగా లేచి నిల్చుంది.

'ఇదుగో! నేనూ వస్తున్నానండీ రాణీ గారూ! మరీ అంతకోపమయితే ఎలా?'

'ఇదుగో అమ్మాయి, ఈసారి నుండి, రాణి, కాణి అన్నావంటే తంతాను జాగ్రత్త!' ఉరిమి చూసింది స్నేహితురాలిని.

'అదేదో సినిమాలో విజయనిర్మల లాగ నీకూ స్టంటు వచ్చా?' అని నవ్వుతూ 'అయితే అందరూ ఎదురు చూస్తున్న హీరోయిన్ దొరికినట్లే' అంది ఏదో ఆలోచిస్తున్నట్లు.

'ఇదే లాస్ట్ వార్నింగ్, పిచ్చి పిచ్చిగా మాట్లాడకింక! లేకపోతే ఇదే లాస్ట్ వర్డ్ అండ్ లాస్ట్ డే నీతో మాట్లాడడం — నీతో ఉండటం!' అంది సీరియస్‌గా గబగబా అడుగులువేస్తూ.

'అలాగే కానీ! ఇంక ప్రశాంతంగా ఉండు. అందరూ మనల్నే చూస్తున్నారు. పోట్లాడుకుంటున్నా మనుకుంటారు' ఆమె చేయి మెల్లగా నొక్కింది ఉమ.

ఉమ ఎక్కగానే స్టీరింగ్ ముందు కూర్చుని కోపంతో డోర్ గట్టిగా లాగింది. ఆ శబ్దానికి ప్రక్కనే ఆగిన కారులోంచి ఇప్పుడే దిగిన ఇద్దరబ్బాయిలు, ఉమ ఉలిక్కిపడ్డారు. 'ఈతీరున నీ కారు ఎన్ని నెలలు వస్తుందంటావ్?', అంది సీరియస్‌గా ఉమ. తన కోపానికి నవ్వుకుంది రాధిక.

* * *

నిజానికి రాధికది, ఉమది విశాఖపట్టణం. ఇద్దరిళ్లు ప్రక్క ప్రక్కనే అవటంవలన, వయసులోను, చదువులోను ఒక్కటె కావటం వలన ఇద్దరూ ప్రాణ స్నేహితులయ్యారు. పి. యు. సి. పరీక్షలు అయిన తరువాత సేల్స్‌టాక్స్ ఏజంటుగా పని చేస్తున్న ఉమ తండ్రికి హైదరాబాద్ బదిలీ కావటంతో ఇద్దరూ విడిపోక తప్పలేదు. మనుషులు వేరైనా, మనసులు ఒకటిగా ఏడాది గడిపేశారు. మరుసటి సంవత్సరమే డిస్ట్రిక్ట్ కలెక్టర్ చేస్తున్న రాధిక తండ్రికి కూడా హైదరాబాద్ ట్రాన్స్‌ఫరయింది. ఇద్దరి ఆనందానికి అవధులు లేకపోయింది.

రాధిక — ఒకటే సంతానం; తరగని ఆస్తి ఉండటంవలన అడక్కముందే అన్నీ అందిస్తూ అల్లారు ముద్దుగా పెంచారు ఆమె తలిదండ్రులు. చదువులో కంపేరటివ్ డిగ్రీలో వున్నా అందంలో సూపర్లేటివ్ డిగ్రీలో ఉంటుంది. ఆమె నడకలో, నవ్వులో, మాటల్లో గర్వం తొంగి చూసినా ఆమె మనసు చాలా మంచిది— అంటారు తెలిసినవాళ్లు. నిజం కూడా అదే! కాని ఆమెకు కోపం పిలవని పేరంటంలా వచ్చేస్తుంది. ప్రాణ స్నేహితులైన వాళ్లిద్దరికీ అన్నిట్లోనూ కొంచెం డిఫరెన్సు కనిపిస్తుంది చూసిన వాళ్లకు. ఆమెకు అందంలో ఉన్న డిగ్రీ ఈమెకు చదువులోనూ, చదువులో ఉన్న డిగ్రీ అందంలోనూ ఉంటుంది. లోకం పోకడ తెలిసిన ఉమ సహజంగానే శాంతస్వభావురాలు. రాధికది దీనికి పూర్తిగా కాకపోయినా ఎక్కువగానే విరుద్ధ స్వభావం. ఆమెకు కోపం వస్తే చేతిలో ఉన్నదేదైనా గట్టిగా విసిరేస్తుంది. 'రేపు వచ్చే నాథుడుకూడా నీలా కోపిష్టి అయితే మీ యింట్లో వస్తువులన్నీ వీధిలో ఉంటాయన్న మాట' అంటుంది స్నేహితురాలిని ఏడిపించటానికి. 'పోనీలే! నీవు ఉన్నావుగా ఏరి పెడుదువుగాని'. 'మళ్లీ ఏరి అందించనా?' అనగానే ఎంత కోపంలో ఉన్నా నవ్వేస్తుంది రాధిక.

* * *

సెకండ్‌అవర్ అయిపోవస్తోంది ఫైనల్ బి. కామ్ క్లాసులోంచి ఎకౌంటెన్సీ లెక్చరర్ బయటికి వెళ్లిపోతున్నాడు. 'గోపాలక్రిష్ణగారిని ప్రిన్సిపాల్‌గారు రమ్మంటున్నారు' అన్నాడు గడపలో నిల్చుని ఆఫీసు ప్యూన్. శ్రీరామ్‌తో బయలుదేరాడు గోపాల్. శ్రీరామ్, గోపాల్‌కి అత్యంత స్నేహితుడు. ఇంటా బయట కూడా! ప్రిన్సిపాల్‌రూమ్ ఆ బిల్డింగ్‌కి చాలా దూరంగా ఉంటుంది.

'ఎందుకు పిల్చారంటావ్?' అన్నాడు సందేహంగా గోపాల్.

'ఏముంది, కాలేజీ రీఓపెన్ అయిందిగా' ఏదైనా మీటింగు ఉందేమో సాయంత్రం?

'అదే అయి ఉంటుంది!' అన్నాడు వాళ్ళ వైపే వస్తున్న ఇద్దరి స్టూడెంట్స్‌ని చూస్తూ. వాళ్ళిద్దరూ బి. యస్. సి. సెకండియర్ స్టూడెంట్స్. 'ఏమండీ! ఈ పర్స్ లేబరేటరీలో మర్చిపోయారు వాళ్ళు' అన్నారు అటువైపు చూస్తూ. లాస్ట్ అవర్ ఖాళీ అవటంవలన ఇంటికి బయలుదేరారు రాధిక, ఉమ.

'ఎవరిదో తెల్సుగా, మీరే ఇవ్వరాదూ? అన్నాడు గోపాల్.

'వద్దు మీరే ఇవ్వండి. ఇందాక లేబరేటరీలో మేమే కావాలని దాచేశాం అనుకుంటారు' అన్నారు బతిమాల్తున్న ధోరణిలో. వాళ్ళ భయానికి నవ్వుకుని 'సరే ఇలా ఇవ్వండి!' పర్సు తీసుకుని గబగబా నడవటం మొదలు పెట్టారు.

'క్రొత్తగా వచ్చిన ఆ రాధికంటే చాలా మందికి భయం!' అన్నాడు శ్రీరామ్ నవ్వుతూ.

'ఎందుకని?!'

'ఆమె సత్యభామకు ప్రతిరూపం. ముఖ్యంగా స్వభావంలో!

'నీకెలా తెలుసు అప్పుడే?'

'నిన్న ఉమ చెప్పిందిలే!'

'ఏదేం, మీ ఇద్దరు మాట్లాడేసుకుంటున్నారా?'

'తన అవసరంగా మరి. బాగానే మాట్లాడుతుంది' నవ్వాడు శ్రీరామ్.

'తన అవసరమేమిటి?' అర్థంకాక తికమక పడ్డాడు గోపాల్.

జవాబు ఇవ్వకుండానే 'అటు చూడు!' అన్నాడు శ్రీరామ్, కారు కీస్‌కోసం పర్స్ తీయబోయి 'అమ్మో! నాపర్స్' అంది రాధిక గబుక్కున వెనక్కి తిరిగి వెదుకుతూ. 'ఏమండీ! ఇదిగో మీ పర్స్!' అందించాడు గోపాల్. 'మేనీ థాంక్స్!' అనుమానంగా చూస్తూ పర్సు తీసుకుని తిరిగి చూడకుండా కారుదగ్గరికి నడిచింది. శ్రీరామ్‌ని చూసి నవ్వి ఏదో సైగ చేసింది ఉమ. కారు లాక్ తీస్తున్న రాధిక అది గమనించలేదు.

'అంతకోపమైతే నేనెంత బాధపడతానో తెలుసా?' సైకిల్‌మీద పాడుకుంటూ ప్రక్కనించి వెళ్ళాడో కొంటెకుర్రాడు. ఒక్కసారి కోపంగా వెనక్కి తిరిగిచూసి స్టీరింగ్ ముందు కూర్చుని డోర్ విసురుగా లాగి

రాధికా పరిణయం

వేసింది. ఆ విసురుకు అదిరిపడిన శ్రీరామ్ ఆ రోజుకూడా ఈమెకారే అయి ఉంటుంది అన్నాడు సాలోచనగా. 'ఏరోజు?' అన్నాడు గోపాల్, 'అదే ... పార్కుదగ్గర గుర్తు లేదూ' 'ఆ...అవును గుర్తొచ్చింది. సత్యభామ!' అన్నాడు నవ్వుతూ.

'ఎందుకే అంతకోపం? వాళ్ళేం చేశారని, దొరికితే తీసుకువచ్చి ఇవ్వటంకూడా తప్పేనా? ఎక్కడ దొరికిందని మాట వరసకైనా అడిగావా? నిర్లక్ష్యం అనుకోరూ?' అంది ఉమ మందలిస్తున్నట్లు. 'అనుకోనీ! అన్ని బిరుదులతోపాటు ఇదికూడా!' చిరాగ్గా ఉంది.

'మీ పేరెంట్స్ పొరపాటున రాధిక అని పెట్టారుకాని 'సత్యభామ' అని ఉండాల్సింది.'

'అప్పుడు నీవు రుక్మిణివి! అప్పుడేంటి ఇప్పుడు, ఎప్పుడూ రుక్మిణివి: సరేకాని సాయంత్రం షికార్‌కి పోదాం వస్తావా?'

'ఎందుకు పోట్లాడుకోటానికా?' నవ్వుతూ ఉమ.

'నీవేమీ అనందే నేనెందుకు పోట్లాడతాను?

'అవును మరి! నీవు బోలెడు మంచి దానివి!'

'అవునట! మమ్మీ, డాడీకూడా ఈమాటే అంటారు' అంది అమాయకతను నటిస్తూ. ఆమె జాణతనానికి నవ్వుకుంది ఉమ. 'పార్కుకి వెళ్దామన్నావుగా? తప్పకుండా రావాలి, ఒక్కగంటలో!' కారు దిగుతూ హెచ్చరించింది.

పబ్లిక్ గార్డెన్స్‌ముందు కారు పార్కు చేయబోతున్న రాధిక ప్రక్కనే ఆగి ఉన్న గోపాల్ కారుని చూసి తిరిగి స్టార్టు చేసింది. తన ప్రయత్నం విఫలమైనందుకు కోపమొచ్చింది ఉమకు. అయినా, పైకి కనిపించనీకుండా 'ఎందుకు? మళ్ళీ వెనక్కి తిప్పావు?' ఉమకు నిజంగా తెలియదనుకుని 'ఈ రోజు టాంక్‌బండ్ మీదకు పోదాం!' అంది.

'పరీక్షలు వస్తున్నాయి. లాస్టియరంతా హేపీగా తిరిగినా ఈసారి పబ్లిక్ కదా! కష్టపడి చదివితేకాని పాసవలేం!' అంది ఉమ తనలో తను అనుకుంటున్నట్లుగా.

'అంటే, ఇకపై షికార్లు వద్దనా అర్థం?' కనుబొమ్మలు కొద్దిగా ముడిచి ఓరగా చూసింది.

'అదుగో ఆ కోపమే వద్దనేది, రేపు వచ్చేవాడు...'

'షటప్!' కోపంతో కళ్ళెర్రచేసి చూసింది.

'శాంతించు దేవి, శాంతించు! నీ కోపాగ్నిలో భస్మం చేయకు! ఈ భూమి మీద నేను నెరవేర్చవలసినవి ఇంక చాలా ఉన్నాయి. ముఖ్యంగా నీ పరిణయం విషయంలో' అంది పక్కా భక్తురాలి పోజులో చేతులు జోడించి. ఆమె మాటలకు కోపం మరిచిపోయి నవ్వేసింది. 'నా పెళ్ళి విషయంలో నీకంత శ్రమ ఎందుకులే' నీది నీవు చూసుకుంటే చాలు!'

'అయితే, నీవు ఇదివరకే చూసుకున్నావన్నమాట, ఇంత స్నేహితురాలినికదా? నాతో మాట మాత్రమైనా చెప్పలేదే మరి! ఇంతకీ ఆ అదృష్టవంతుడెవరో చెప్పు, అతనికి నీ గురించి కొన్ని విషయాలు, నీతో ఉన్నప్పుడు ఆచరించవలసిన జాగ్రతలు నేర్పాలి,' కొంటెగా నవ్వింది.

'అల్లరిపిల్లవైపోయావు, ఈ నీళ్ళు బాగా వంట బట్టినట్లున్నాయే?'

'ఆ...అవును, నీకూపడితే కోపం తగ్గిపోతుందేమో!

'మాటల్లో నీతో గెల్వలేను బాబూ!' కారు ఒక్క కుదుపుతో ఆగింది.

'పోనీ స్టంటుచేసి చూద్దామా? ఎవరు గెలుస్తారో? నవ్వింది రాధిక ...'

టాంక్‌బండ్ వచ్చేపోయే జనంతో రష్‌గా ఉంది. ప్రశాంతంగా ప్రవహిస్తున్న హుసేన్‌సాగర్‌ని చూస్తూ నిల్చున్నారు. చాలాసేపు ఇద్దరిమధ్యా నిశ్శబ్దం రాజ్యం చేసింది.

'అబ్బ! ఎలా, మాట్లాడుకోటానికేమీ దొరకటం లేదు?' ఉన్నట్లుండి అంది ఉమ. నవ్వుకున్నారిద్దరూ. ఉమ వచ్చేసిన తరువాత విశాఖలో తనెలా గడిపింది, బి. యస్. సి. ఫస్టియర్‌లో ఎంతమంది స్నేహితులైంది చెప్పింది రాధిక. నెలరాజు చిరునవ్వుతో పలకరిస్తున్నాడు. ఆ పలకరింపుకు సంతోషంతో మిలమిల మెరిసిపోతోంది హుసేన్‌సాగర్.

'ఇంక పోదామా, చీకటిపడుతోంది!'

'సరే పద!'

* * *

పదికావస్తోంది. మార్చినెల కావటంవలన ఎండ తీక్షణంగానే ఉంది. సడన్ బ్రేక్‌తో ఆగింది కారు హారన్ విని పుస్తకాలు సర్దుకుంటూనే పరుగునవచ్చింది ఉమ. స్టీరింగ్ ముందు డ్రైవర్‌ని చూసి బాక్ సీట్లో కూర్చున్న రాధికవైపు ప్రశ్నార్థకంగా చూసింది.

'కారుకి రిపేర్‌వర్క్ ఉందిట, మనం వర్క్‌షాపుదగ్గర దిగి రిక్షాలో పోదాం!'

'రిక్షాలో ఎందుకు? మన బస్సులో పోదాం!'

'వద్దు బాబూ! సీట్ లేకపోతే బోయీస్‌తో పాటు నిల్చుని వ్రేలాడలేక చావాలి!

'సరేగాని, సాయంత్రం మా పెద్దమ్మ గారింటికి వెళ్దాం వస్తావా? లేకపోతే నీ ఒక్కదానివే వెళ్ళిపో! నేను రిక్షాలో వెళ్ళివస్తాను. ఈ సంవత్సరం ఇంతవరకు ఒక్కసారికూడా వాళ్ళింటికి వెళ్ళలేదు'

'సాయంత్రం కారుకూడా లేదు. ఒక్కదాన్ని ఎలా వెళ్ళటం! పోనీ నేనూ వస్తాలే!'

'ఆల్‌రైట్, యు ఆర్ ఎ గుడ్‌గర్ల్!' తన మాటకి ఒప్పినందుకు సంతోషంతో గబుక్కున ఆమె బుగ్గమీద ముద్దుపెట్టుకుంది. 'మళ్ళీ మాట తప్పకూడదమ్మాయ్!' సరేనన్నట్లుగా తల ఊపింది రాధిక.

శ్రీరామ్‌కోసం ఎదురుచూస్తూ లాన్‌లో వేసిన కుర్చీలలో కూర్చుని ఇంగ్లీష్ ప్రోజ్ చదువుకుంటున్నాడు గోపాల్. గేటు శబ్దానికి తలెత్తి చూసి ఆశ్చర్యపోయాడు.

'హల్లో! ఏమిటి మా పై ఇన్నాళ్ళకి దయ కలిగింది' అంటూ ఆహ్వానించాడు రాధికా ఉమలను.

'సరేగానీ, పెద్దమ్మ ఉందా అన్నయ్యా?' అంది టీపాయ్‌మీద పుస్తకాలు పడేస్తూ.

'పెద్దమ్మ లోపలే ఉంది కాని నీవు వెదుకుతున్న చెలికాడు మాత్రం లేడు! అన్నాడు ఆమె చూపులను గమనించి నవ్వుతూ.

'ఛీ...పో, అన్నయ్యా!' అందుకే మీ యింటికి రానిది!' అంటూ లేడిలా లోపలకు పరుగెత్తింది. రాధికకి ఉమమీద చచ్చేంత కోపంవచ్చింది. పెద్దమ్మ అంటే ఎవరో అనుకుంది కాని ఈ మహానుభావుడుంటాడని తెలిస్తే అసలు వచ్చేదేకాదు. పెద్ద స్నేహితురాలిలా నటిస్తుంది కాని ఇంతోటి అన్నయ్య ఉన్నాడని చెప్పి ఏడిస్తేగా! సస్పెన్స్‌లో పెట్టి తీసుకొచ్చిందిగాక, ఇక్కడే వదిలేసి పోయింది. ఈ పిల్లతో ఇంకెక్కడికీ పోకూడదు. 'డామ్ ఇన్సల్ట్...తిరిగి వెళ్ళిపోదామంటే ఈ మహానుభావుడు ఇటే వస్తున్నాడు.' కసిగా క్రింది పెదవిని కొరుక్కుంటూ నిలబడింది.

'నమస్తే! కూర్చోండి' అన్నాడు గేటు వేసి వస్తూ.

'థాంక్స్! నేను వెళ్తున్నాను. ఉమతో చెప్పండి' అంది వెనుతిరుగుతూ.

'అరె, అదేమిటండీ! ఉమమీద కోపం నామీద చూపిస్తారే! మీ స్నేహితుడిగా అడుగుతున్నాను. ప్లీజ్! సిట్‌డౌన్!' మృదువుగా పలికిందతని కంఠం. సంశయిస్తూ అలాగే నిలబడిందామె,

లైట్ గ్రీన్ ఫుల్‌వాయిల్ చీర. డార్క్ గ్రీన్ రూబీలాన్ బ్లౌజు. మెడలో సన్నని లాకెట్ చైన్. చెవులకి డైమండ్ రింగులు కుడిచేతికి రెండు బంగారు గాజుల మధ్య రెండు ఎర్ర మట్టిగాజులు, ఎడం చేతికి ముద్దొస్తున్న చిన్న స్క్వేర్ వాచీ ధరించింది. నల్లని నొక్కుల జుట్టు. ఫాలభాగం పై నాట్యమాడుతున్న అల్లరి ముంగురులు, పొడవైన వాలుజడలో కనకాంబరాలు ఆమె వదనంలాగే వాడి ఉన్నాయి క్రిందికి వాలి ఉన్న అందమైన కళ్ళు భయంతో కాబోలు చంచలంగా కదులుతున్నాయి. మంచులో తడిసిన గులాబీ రేకుల్లాంటి పెదవులు కోపంతో కొద్దిగా కంపిస్తున్నట్లున్నాయి. ఒక చేతిలో హృదయానికి దగ్గరగా పెట్టుకున్న బుక్స్, రెండోచేయి ముందున్న కుర్చీ మీద వేసి నిల్చుని 'దివినుండి దిగి వచ్చిన మెరుపు తీగేమో' అనిపిస్తున్న ఆమెను ఒక్క క్షణం రెప్పలార్పకుండా చూశాడు.

'పోనీ, నేనటు వెళ్తాను. మీరు వచ్చి కూర్చోండి.'

బయటపడి పోయినందుకు అభిమాన పడుతూ 'ఊహుఁ...ఏదేం లేదు' అంటూ గబుక్కున ముందుకు వచ్చి కుర్చీలో కూర్చుంది. చదువుతూ ఆపేసిన పేజి తీసి చదవటం మొదలుపెట్టాడు. 'ఏమీ మేనర్స్ తెలియదు ఎదురుగా మనిషి ఉన్నా తనే పెద్ద చదువుతున్నట్లు పోజు కొడుతున్నాడు అవునుమరి — పాపం! క్లాస్ రావాలి, పాసవ్వాలి! గతి లేక కూర్చున్నట్లు నేనెందుకిక్కడ? ఇదంతా ఆ పాడుపిల్ల మూలంగా వచ్చింది.' మనస్సులో వంద ఆలోచనలతో చిరాగ్గా కూర్చుంది. అందమైన చిన్న చిన్న రంగుల పూలు చిరుగాలికి తల లూపుతూ ఆహ్వానిస్తున్నాయి. గులాబి సహం వాడి నీరసంగా నవ్వుతోంది. అప్పుడే విరుస్తున్న నైట్‌క్వీన్, సన్నజాజి, మల్లి, చైనా బాక్స్ తీయని పరిమళాన్ని వెదజల్లుతున్నాయి. లాన్స్‌కి కొంచెం దూరంలో ఫౌంటెన్ రంగునీళ్ళను చిమ్ముతోంది చుట్టూ ఎత్తుగా ఉన్న ఫౌంటెన్ గోడమీద నాలుగు వైపులా ఒకే భంగిమలో నిల్చున్న అందమైన శిల్పాలు, పైకెత్తిన వాటి చేతుల్లో (కింద నీటిలో ప్రతిబింబించేట్లు అమర్చిన లైట్స్ — కాంపౌండ్ వాల్‌కి కొంచెం ఇవతలగా స్విమింగ్ పూల్, దాని చుట్టూ అందంగా కత్తిరించిన ఫెన్సింగ్ — నిశ్శబ్దంగా అన్నిటినీ పరికిస్తున్న ఆమె కళ్ళు అతని పక్కకు వచ్చి ఆగిపోయాయి.

గాలికి జుట్టు కొద్దిగా లేచి, విశాల ఫాలంపై పడుతున్న రెండు, మూడు రింగ్స్, ఎత్తయిన క్రాప్, పట్టుదల కార్యదీక్ష ప్రతిఫలిస్తున్న కళ్ళు, నవ్వుతూ ఆగినట్లున్న పెదవులు, లైట్ బ్రవున్ టెర్లిన్ స్లాక్, వైట్ టెరీకాటన్ షర్ట్, పాయింటెడ్ బ్లాక్ షూ, సాక్స్ — ఎడం చేతికి రేడియం డయల్ వాచీ, కుడి చేతిలో పుస్తకం. కాలేజీలో చేరకముందు ఉమ వర్ణించిన రాజకుమారుడు గుర్తొచ్చి చిన్నగా నవ్వుకొంది.

'కోపం పోయినట్లుందే — నవ్వుకుంటున్నారు?' అన్నాడు పుస్తకం టీపాయ్ మీద పడేస్తూ. ఆ పుస్తకం తగిలి ఉమ పుస్తకాలు ప్రక్కగా కిందపడ్డాయి. చటుక్కున ఒకేసారి వంగిన ఇద్దరి తలలు 'ఢీ'కొట్టుకున్నాయి. గుండె ఝల్లుమనగా గబుక్కున లేచి సరిగా కూర్చుంది. గోపాల్ పుస్తకాలు తీసి టీపాయ్‌మీద పెట్టాడు సిగ్గుతో వాడిపోయిన ఆమె వదనాన్ని చిరునవ్వుతో తిలకిస్తూ కూర్చున్నాడు.

'ఏమిటి మౌనంగా కూర్చున్నారు? మాటలు మర్చిపోయారా? లేక వాటి అవసరం లేదా?' అంటూ వచ్చాడు శ్రీరావ్.

తడబడుతూ చూపులను ఆమె నుండి మరల్చుకుని శ్రీరావ్ వైపు చూశాడు గోపాల్.

'ఉమేది?'

'లోపలికెళ్ళింది, ఇంకా ఎంతసేపటికీ ఊడిపడదే?'

'పిలుచుకొస్తా నుండండి,' అంటూ లోపలికి పరుగెత్తాడు శ్రీరావ్.

'అల్లరిపిల్లడు' అన్నాడు నవ్వుతూ 'ఉమకూడా ఇంతే, ఇద్దరికీ సరిపోయింది జోడు'

'ఏమిటన్నారు' అంది ఉలిక్కిపడి సర్దుకుంటూ.

'ఏం లేదు ఉమ మీకేమీ చెప్పలేదా? నమ్మలేనట్లు అడిగాడు. లేదన్నట్లు తల ఊపింది'

'వీళ్ళిద్దరికీ పరీక్షలవగానే పెళ్ళి జరుగుంది. అప్పటివరకు కలుసుకోకూడదని మాట్లాడుకో కూడదని రూల్ పెట్టింది ఉమ. శ్రీరావ్ ఎప్పుడూ నాతోనే ఉంటాడని ఇక్కడకు రావటంకూడా మానేసింది. కాని ఇంతవరకు...

'అదుగో అన్నయ్యా, చెప్పేశావ్ కదూ? ఆడవానినోట్లో నువ్వుగింజ నానదంటారు కాని నీ నోట్లో దానిలో హాఫ్‌కూడా నానదు.' అంటూ వచ్చింది ఉమ వాళ్ళ పెద్దమ్మతో కలిసి. 'ఆవిడకూడా అందంగానే ఉన్నారు?' అనుకుంది రాధిక. డ్రింక్స్ ఉన్న ట్రే టీపాయ్‌మీద పెడుతూ పెద్దమ్మని పరిచయం చేసింది. లేచి నిల్చుని 'నమస్తే!' అంది చేతులు కలిపి. 'కూర్చోమ్మా!' అంటూ శ్రీరావ్‌కి గోపాల్‌కి మధ్య చైర్‌లో కూర్చున్నారావిడ. అందరికి డ్రింక్స్ ఆఫర్‌చేసి తనొకటి తీసుకుని స్నేహితురాలి ప్రక్కన కూర్చుంది ఉమ. తండ్రితో ఎన్నిసార్లు క్లబ్బులకి హోటల్స్‌కి వెళ్ళినా గోపాల్ ఎదురుగా త్రాగటానికి భయపడుతూ ఎలాగో పూర్తి చేసింది రాధిక.

కాసేపు అవి ఇవీ మాట్లాడి 'వనుందమ్మా! మీరు మాట్లాడుకుంటూ ఉండండి అంటూ లేచి వెళ్ళిపోయారావిడ. 'వంటవాడిడ కూరల్లో కారాలవీ ఎక్కువ వేస్తే, వాళ్ళ ముద్దుల కుమారుడు తినలేక పోతాడని భయం మా పెద్దమ్మకి' అంది ఉమ. తలెత్తి చూడబోయిన రాధిక నవ్వుతూ తనవంక చూస్తున్న గోపాల్‌ని చూసి చటుక్కున మరోవైపుకు త్రిప్పుకుంది చూపులను.

'రేపు ఆదివారంగా? ఏదైనా పిక్చర్‌కి వెళ్దాం. ఈ సంవత్సరమంతా నీ పుణ్యమా అంటూ సినిమాలే లేకుండా చేశావ్!' అన్నాడు శ్రీరావ్ ఉమతో.

'నాకు తెలీదనుకున్నారు కాబోలు పాపం! వైజయంతిమాల సినిమాలు ఎన్ని చూసిందీ, ఎన్నిసార్లు చూసిందీ?'

'అందుకే, షమ్మీకపూర్ సినిమాలన్నీ మిగిలిపోయాయి' ఉక్రోషంగా అన్నాడు.

'ఇదుగో, మిష్టర్! నాలో మాట్లాడకింక. పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి. సినిమా గినిమా నై...'

'నీ యిష్టమైనప్పుడు మాట్లాడతాననుకున్నావా? అయితే సరే! నేనా నాటకంలో యాక్టు చేయను ఇకమీద.' నవ్వాడు శ్రీరావ్.

వారిమాటలు అర్థంకాక అయోమయంగా చూశారు రాధిక, గోపాల్.

ఇంక పోదామన్నట్లుగా ఉమ చేయి నొక్కింది. 'ఇంక వెళ్తాం అన్నయ్యా! వెళ్తున్నాం!' అంది శ్రీరావ్‌వైపు చూడకుండా. గోపాల్ కారు గారేజీలోంచి తీయడానికి వెళ్ళాడు. పెద్దమ్మతో చెప్పి వస్తానంటూ వెళ్ళపోయి ఎదురు వస్తున్న ఆమెను చూసి ఆగిపోయింది. ఆమెన్ని చూసి ఏమనలేక అయిష్టంగానే కారెక్కింది రాధిక, కారులో ఉన్నంతసేపూ స్టీరింగ్ ప్రక్కనున్న అద్దంలో తన ప్రతిబింబాన్ని గోపాల్ చూపులనుండి తప్పించలేక అవస్థ పడింది. ఇంటిముందు కారాగగానే దిగి ఉమతో మెల్లిగా 'మీ అన్నయ్యకు థాంక్స్ చెప్పు!' అంటూ అప్రయత్నంగా అటుచూసిన ఆమె కళ్ళకు 'నో థాంక్స్!' చెప్పాయతనికళ్ళు.

'ఏమో అనుకున్నాగాని పాపం! మంచివాడులానే ఉన్నాడు!' అనుకుంది రాత్రి పడుకోబోతూ.

'అంత గడుసుపిల్లకి నన్ను చూడగానే సిగ్గూ, భయం ముంచుకొచ్చాయెందుకో!' అనుకున్నాడు లైటు తీసి ప్రక్కమీద వాలుతూ గోపాల్.

'ఇంక రేపటినుండి రాధికలో మార్పును గమనించాలి. ఏమో, మొండిఘటం! అసలే మైనా మాట్లాడిందో లేదో అన్నయ్యతో. శ్రీరావ్ నిజంగానే ఉడనంటే నేనొక్కదాన్నే నడిపించగలనా ఈ నాటకం?' అనుకుంది ఉమ పుస్తకం మూసేస్తూ.

* * *

'వచ్చినంత హడావుడిగనూ వెళ్ళిపోయాయి పరీక్షలు. సినిమా ప్రోగ్రాం వేశాడు శ్రీరావ్. ఎంత బతిమాలినా రాధిక రానంది. 'ఇదుగో, అమ్మాయి! ఆ



రోజునుండి చూస్తున్నా. అదే! మా పెద్దమ్మ గారింటికి వెళ్ళినప్పటినుండి ఏదోలా ఉంటు న్నావు! కోపంకూడా ఇదివరకులా పిలవనిదే రావటం లేదు. కొంపదీసి ఇదంతా మా అన్నయ్య మహత్యం కాదుగదా?' చిలిపిగా అడిగింది ఉమ. ఉమచేతిని మృదువుగా తోస్తూ, ముఖం ప్రక్కకు తిప్పుకుని నవ్వుకుంటూ 'ఛీ, ఫో...మరీ చిలిపిదానివై పోతున్నావు!' అంది రాధిక. 'అలాగే పోతా గానీ ఇంతకీ నీవు రావా?' తల అడ్డంగా ఊపింది. గోపాల్ ఎలాగో వస్తాడు కనక తనని ఆటలు పట్టిస్తుందేమోనని భయంతో ఆగిపోయింది. 'శ్రీరామ్ ఎదురు చూస్తుంటాడేమో? ఈ మొండిపిల్ల వచ్చేట్లు లేదు మరేదయినా ప్లాన్ వెయ్యాలి' అనుకుంటూ గబగబా వెళ్ళిపోయింది ఉమ. ఏమీ తోచక గరేజీలోంచి కారు తీసుకుని పబ్లిక్‌గార్డెన్స్‌కి బయల్దేరింది రాధిక. ఉమ, శ్రీరామ్‌లను థియేటర్‌దగ్గర దింపి 'నేను తర్వాతవస్తాను. మీ ఇద్దరు వెళ్ళండి' అంటూ కారు వెనక్కి త్రిప్పాడు గోపాల్. అలా ఎందుకు చేశాడో గ్రహించిన ఇద్దరూ సిగ్గుపడ్డారు. అటు ఇటు తిరిగి చివరికి పబ్లిక్‌గార్డెన్స్‌కి దారితీసింది గోపాల్ కారు.

'ఇదే. మొదటిసారి! ఒంటరిగా రావటం' అనుకుంటూ అటు, ఇటూ చూస్తూ నడు స్తోంది రాధిక. ఆకాశం ఎర్రబడటంవలన ప్రకృతి వింతకాంతితో మెరుస్తోంది. ఆ వెలుగులో తెల్లని పుల్‌వాయిల్ చీర లైట్ రెడ్‌గా కనిపిస్తోంది. ఆమె జడలోని మల్లెలు సిగ్గుపడుతూ నవ్వుతున్నాయి సూర్యుడు పూర్తిగా అస్తమించకముందే, తన స్నేహితురాళ్ళను చిరునవ్వుతో పలకరిస్తు న్నాడు పాడ్యమి చంద్రుడు.

'హలో, గుడీవినింగ్! కోటివీణలు మ్రోగాయి ఆమె హృదయంలో. ఉలిక్కిపడి చుట్టూ చూసింది. చిరునవ్వుతో పలక రించాడు గోపాల్.' మీరొక్కరే వచ్చినట్లు న్నారే! అన్నాడు పరిసరాల్లో చూస్తూ అవునన్నట్లు తలవూపింది. ఏదోభయంతో గుండె వేగంగా కొట్టుకుంటోంది.

'రండి! అలా పోయి కూర్చుందాం? ముందుకు దారి తీశాడు.

నిశ్శబ్దంగా అనుసరించింది.

ఇద్దరూ నైట్‌క్వీన్ పొద ప్రక్కన కూర్చున్నారు.

'మీరు పిక్చర్‌కి పోలేదా?' అప్ర యత్నంగా అడిగి ఎందుకడిగానా, అను కుంది.

'లేదండీ! మీరు రానన్నారట! ఇంక వాళ్ళిద్దరిమధ్య ఎందుకులే అని మానే శాను!'

భావయుక్తంగా నవ్వాడు.

రాధిక గుండె జల్లుమంది. తలవంచుకుని వేళ్ళతో పచ్చికను తెంపుతూ కూర్చుంది.

'నేనంటే భయమా మీకు?'

లేదన్నట్లు తల వూపింది. ఇదివరకు తనే అందర్నీ ఈ ప్రశ్న వేసేది.

'మరి మాట్లాడరేం? పరీక్షలు బాగా వ్రాశారా?'

'ఊ...మరి మీరు?' ఏమీ అడగక పోతే బాగోదేమో, అన్నట్లు అడిగింది.

'క్లాస్‌రావాలని చదివాను మరి! వస్తే ఫారిన్ వెళ్ళాలనుకుంటున్నాను!' ఆమె ముఖంలో మారుతున్న భావాలను గమనించి నవ్వుకున్నాడు. 'ఉమ చెప్పింది నిజమే' అను కుని ధైర్యం తెచ్చుకున్నాడు,

'ఎం. కామ్ ఇక్కడే చదవచ్చుకదా? చదవాలనుకుంటే!' అంది జవాబు ఏదో ఇవ్వాలన్నట్లుగా!

'నేను వెళ్ళటం మీకిష్టంలేనట్లుందే?' సూటిగా ప్రశ్నించాడు ఆమె ముఖంలోకి చూస్తూ. అనుకోని ప్రశ్నకు తడబడి 'ఉహూం. అదేం కాదు'...అంది బెదిరిపోయి నట్లు.

'ఇటు చూడండి రాధికా!' మృదువుగా పిలిచాడు.

అతని గొంతులో నిండిన అనురాగానికి పులకించిందామె మనస్సు. బరువుగా కను లెత్తి చూసింది.

'మీరు పరిచయమైన మొదటి క్షణం లోనే మీ మనస్సు తెల్సుకున్నాను. కొద్ది రోజుల్లో కంట్రీ విడిచిపెట్టి వెళ్తు న్నాను కనుక, వెళ్ళేముందు నా మనసు కూడా మీకు తెలపాలని ఎదురు చూస్తు న్నాను సమయంకోసం. ఇప్పటికి వచ్చింది ఫారిన్ వెళ్ళేలోపల పెళ్ళిచేసుకుని వెళ్ళ మని మా అమ్మా, నాన్నా పట్టుబడు తున్నారు. 'నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను, పెళ్ళి చేసుకుంటాను' అంటే సినిమాలో డైలాగ్‌లా ఉంటుంది కాని, నిజం అదే! మీ ఉద్దేశ్యం తెలిపితే మీ వాళ్ళతోకూడా నేనే చెప్పిస్తాను. కావాలంటే మీరూ అక్కడే చదువుకోవచ్చు. ఎవరి మనస్సు ల్లోని వారి మనస్సులో అలా ఉండగానే విడిపోతే తర్వాత ఇద్దరూ బాధపడాల్సి వస్తుంది!' నెమ్మదిగా చెప్పాడు గోపాల్.

ముంచుకువచ్చిన సిగ్గు ఆమెను పెదవి విప్పనీలేదు.

'మౌనం అంగీకారం అనుకోవచ్చా?' మధురంగా ధ్వనించిందతని కంఠం.

నవ్వుకుంటూ తల మరీ వంచేసుకుంది. 'చదువుకునే వారికి అందులో మీకు అంత సిగ్గెందుకు? పోనీ. ఎస్, ఆర్, నో అని వ్రాయండి!' అన్నాడు ఆమెచేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

అతని అరచేతిలో వ్రేలితో 'ఎస్' అని వ్రాసింది. ఆమెచేతిని అలాగే తీసి ముద్దు పెట్టుకున్నాడు తీయగా నవ్వింది రాధిక, చేతిని మృదువుగా వెనక్కి తీసుకుంటూ 'అంత కోపమయితే నేనెంత బాధపడ్తానో తెలుసా!' అని పాడుతోంది రేడియో. గతం గుర్తుకురాగా అతని కళ్ళలోకి చూసి నవ్వింది.

'రాధికా!' ఆమె భుజంమీద చేతులు వేసి పిల్చాడు.

'క్రిష్ణా!' మత్తుగా పలికిందామె స్వరం.

నెలరాజు సిగ్గుతో మబ్బుల్లో దాక్కు న్నాడు.

* * *

గేటు తీసుకు వస్తున్న గోపాల్ వాళ్ళని చూసి లోపలికి పరుగెత్తింది రాధిక. ఎదు రేగి వాళ్ళను ఆహ్వానించారు రాధిక తల్లి దండ్రులు. గోపాల్, తల్లి, తండ్రి, ఉమ, తల్లి, తండ్రి, శ్రీరామ్ వరుసగా కుర్చీ లలో కూర్చున్నారు. అందర్నీ పరిచయం చేశాడు శ్రీరామ్. ఒకరి కొకరు నమస్క రించుకున్నారు. ఉమ లేచి రాధిక గదిలోకి వెళ్ళింది. రాధిక తల్లి లోపలికి వెళ్ళి ఆమెను తీసుకు వచ్చింది. వెనకాలే ఉమ కూడా వచ్చింది. సిగ్గుతో నడకే మర్చి పోయినట్లుగా మెల్లగా వచ్చి తల్లి పక్క కుర్చీలో కూర్చుంది. ఆమె ప్రక్కన ఉమ కూర్చుంది.

'ఈ పెళ్ళిచూపులు మనకోసం ఏర్పాటు చేసినవే కాని, నిజానికి యిదివరకే జరిగి పోయినయి' అన్నారు రాధిక తండ్రి కాబోయే వియ్యంకులతో. అందరూ నవ్వుకున్నారు.

సిగ్గుపడుతున్న ఉమను చూసి 'ఈ తీరున ఇద్దరికి జరుగుతున్నట్లున్నాయే పెళ్ళిచూపులు?' అన్నారు కళ్ళజోడు తీస్తూ. సిగ్గుతో తల వంచుకున్నారు ఉమ, శ్రీరామ్‌లు.

'మీ నలుగురు అలా తిరిగిరండమ్మా! మేము మాట్లాడుకుంటూ ఉంటాం!'

నలుగురూ లేచి తోటలోకి దారితీశారు.

'మా నాటకం సంతోషంగా పరిసమాప్తమయింది బాబూ!' పెద్దబరువు దిగిపోయినట్లు అంటూ శ్రీరామ్ ప్రక్కన కూర్చుంది.

'మా దానితోపాటూ మీదికూడా అయిందిగా?' అన్నాడు గోపాల్ ఆశ్చర్యపోయి చూస్తున్న రాధికను చూస్తూ శ్రీరామ్‌తో.

'నిజమే! ఇంట్లో ఎలా చెప్పటమా అని భయపడ్డాను' అంది ఉమ.

'నీకా? భయమా?' వెక్కిరించాడు శ్రీరామ్.

'ఏయ్ మిష్టర్ ఏమన్నావ్?' కోపంగా చూసింది.

'ఆమెగారి కోపం నీకు వచ్చినట్లుందే?' రెట్టించాడు మళ్ళీ.

'అవును మరి—ఆరు నెల్లు సహవాసం చేస్తే వారు వీరూ—వీరు వారూ అవుతారట.' అన్నాడు గోపాల్. ఒకరినొకరు చూసి నవ్వుకున్నారిద్దరమ్మాయిలూ.

'లోపలికి రమ్మంటున్నారు!' అన్నాడు నౌకరు వచ్చి.

లోపలికి వెళ్ళబోతున్న నలుగురూ హాల్లో నవ్వులు వినిపించి ఆగిపోయారు.

'మొత్తానికి మీ ఉమ ఘటికురాలే! ఒక్క దెబ్బకి రెండు పిట్టలు పడేట్టు చేసింది!' అంటున్నాడు గోపాల్ తండ్రి. మిగిలినవారు నవ్వారు. నలుగురూ కూడా నవ్వుతూ వచ్చి కూర్చున్నారు. అందరికీ బిస్కెట్లు, డ్రింక్ ఇచ్చి వెళ్ళిపోయాడు నౌకరు.

'అన్నట్లు మరిచిపోయాను! రిజల్ట్సు రాగానే మా గోపాల్ అమెరికా వెళ్తాడు. అమ్మాయిని కూడా తీసికెళ్తే బావుంటుందనుకుంటున్నాం.'

'తీసికెళ్ళకపోతే మా రాధిక వరదల్లో కృష్ణా జిల్లా మునిగినట్లు విరహ సముద్రంలో మునిగిపోతుంది!' అంది ఉమ. గడుసుగా నవ్వింది రాధిక. అర్థంకాని మిగిలిన శ్రోతలుకూడా నవ్వకుండా ఉండలేక పోయారు. ●

ట్రిపనసోమా

—రంగులరాట్నం—జమ్మికోనేటిరావు—

ఆఫ్రికాలో ఒక ఘోరమైన రోగం ఉంది. దీనిని నిద్రారోగం అంటారు (హాస్యం కాదు!) కాంగో, రోడిషియా ప్రాంతాల్లో ఇది ఎక్కువగా వ్యాపించి ఉంది. ఈ రోగం ఫలితంగా మనుషులు నీరసించి, బద్ధకానికి గురి అయి మత్తునిద్రలో పడి శాశ్వత నిద్ర పొందుతారు. ఈ రోగానికి కారణం ఒక సూక్ష్మ జీవి. దీనిని ట్రిపనసోమా అంటారు. రక్తంలో స్వేచ్ఛగా తిరుగుతూ రక్తాన్ని పీల్చుకొని వృద్ధి పొందుతుంది. అంతేకాక క్రమంగా వెన్నుపాము మెదడు చేరి, నిద్రారోగం సంక్రమింప జేసి మరణాన్ని తెచ్చి పెడుతుంది. రోగగ్రస్తులవడం మూలంగా ఆ ప్రాంతాలు బీదరికానికి ఆలవాలమవుతూ వచ్చాయి. అదే విధంగా గుర్రాలకు పశువులకు కొన్నిటికి కూడా జబ్బులను తెచ్చిపెడతాయి. ఇదే క్రిమి, ఇతర జాతుల ట్రిపనసోములు ఎలకలు మొదలైన ఇతర జంతువుల శరీరంలో ఉన్న వాటికి ఏ విధమైన హాని కలగడంలేదు.

ఒక మానవ శరీరం నుండి మరొక మానవుని శరీరంలోకి ఈ క్రిమిని చేరవేయడానికి వీలు కల్గించే జీవి గ్లోస్సైనా అనే (మన ఈగను పోలిన) కీటకము. అది రక్తం పీల్చినప్పుడు రోగి నుండి తన శరీరంలోకి క్రిములు కూడా ప్రవేశిస్తాయి. అవి కొంతకాలం దాని శరీరంలో వృద్ధి పొంది మార్పులు చెంది తిరిగి దాని కాటు ద్వారా ఇతరుల శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఈ పనిని ఉభయ లింగాల కీటకాలు చేస్తాయి. 'గ్లోస్సైనా'నే ట్సెట్సె (Tse Tse) ఈగ అనీ అంటారు. ఇది మన ఈగ కన్నా కొంచెం పెద్దది. అంతేకాక మన ఈగ లాగా కాక దోమల లాగా రక్తాన్ని పీల్చుకొని జీవిస్తుంది. అయితే దీని జీవిత చరిత్ర చిత్రంగా ఉంటుంది. గ్రుడ్లు పెట్టదు (ఈగలు గ్రుడ్లు పెడతాయి). ప్రతి పదిరోజులకి ఒకేలార్వా! పూర్తిగా ఎదిగి జన్మిస్తుంది. పుట్టగానే ఆహార తాపత్రయం పడక వెంటనే నేలలో దూరి 'ప్యూపా'గా మారుతుంది. తరవాత కొన్నివారాల తరవాత రూప విక్రియ జరిగి ఈగ రూపంలో బయటకు వస్తుంది.

క్రిమిని, ఒక మానవుడి నుంచి మరొక మానవుడికి గ్లోస్సైనా అందించినా, మరొక సదుపాయం కూడా క్రిమి ఏర్పరచుకొంది. అడవిమృగాలు (ఏంటిలోపు మొదలైనవి) శరీరంలో ఇవి నిలవ ఉంటాయి. కాని చిత్రం వాటి కిఏవిధంగాను హాని చెయ్యవు. కాని ఈగ వాటిని కాటు వేసి క్రిములను సేకరించి, మన శరీరంలో ప్రవేశపెట్టినప్పుడు మాత్రం మనకు రోగం వస్తుంది. ఎంత ఘోరం!

ఇప్పటికే మానవుడు ఈ రోగాన్ని పూర్తిగా జయించలేకపోయాడు. ముఖ్యంగా రోగం ముదిరితే, నయం కావడం కష్టం. మొదటి దశల్లో ఆర్సెనిక్ మొదలైన వాటివల్ల కొంత గుణం కనబడుతుంది. ట్సెట్సె ఈగను, నాశనం చెయ్యడం మొదలైన క్రియల వల్ల రోగ నివారణకు కొంత సదుపాయం కల్గింది.